


సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1818 , బ్యాంక్ కెనాల్‌కు 144, తూర్పు కెనాల్‌కు 173 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 559.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన




ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ అంజనేయస్వామికి మంగళవారం పంచామృతాలతో అభిషేకాలు చేసి, నాగవల్లీ దళార్చన నిర్వహించారు. అష్టోత్తర, సహస్ర నామాలతో పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండండి

బాపట్ల జిల్లా కలెక్టర్ సూచన



బాపట్ల: హ్యాకర్లు వివిధ ఫోన్ నంబర్లతో జిల్లా కలెక్టర్ గుర్తింపును దుర్వినియోగం చేస్తున్నారని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు కలెక్టర్ ఫొటో, గుర్తింపు చిహ్నాలతో ఎవరికైనా సందేశాలు వస్తే స్పందించరాదని తెలిపారు. హ్యాకర్లు కలెక్టర్ గుర్తింపును దుర్వినియోగం చేస్తూ 94724 297132 నంబర్ నుంచి కొందరికి మెసేజ్‌లు వెళ్లాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నంబర్లతో ఎలాంటి సమాచారం వచ్చిన తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు.

24న డీఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండేళ్ల కాల పరిమితి గల డీఫార్మసీ కోర్సులో 2024–25 విద్యాసంవత్సరానికి కౌన్సెలింగ్ తరువాత మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాస్తి ఉషారాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ గ్రూపులు పూర్తి చేసిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలతో రూ.6,300 ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు. ఇతర వివరాలకు 92471 20305, 98480 38769, 99593 24563 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జీజీహెచ్‌కు రూ.9 లక్షల విరాళం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఇంకుడు గుంతల అభివృద్ధి ద్వారా ఆసుపత్రిలో నీటి కొరతను నివారించేందుకు గుంటూరు వైద్య కళాశాల 1980 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు రూ. 9 లక్షలు విరాళం అందజేశారు. ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్‌కు పూర్వ వైద్య విద్యార్థులు రూ. 9 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ సిద్దాబత్తుని నాగేశ్వరమ్మ, డాక్టర్ శారద, డాక్టర్ రామారావులను డెప్యూటీ సూపరింటెండెంట్ అభినందనించారు.

ఫార్మసిస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పది గ్రేడ్-2 ఫార్మసిస్టు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ జి.సుచిత్ర తెలిపారు. సదరు నోఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేశామన్నారు. ఫైనల్ మెరిట్ లిస్టును, సెలక్షన్ లిస్టును సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఈనెల 27న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలన్నారు.

నేటి సదరమ్ క్యాంప్‌కు అన్ని ఏర్పాట్లు చేయండి

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం జరగనున్న ప్రత్యేక సదరమ్ క్యాంప్‌కు అన్ని ఏర్పాటు చేయాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ మజీదాబేగం ఆదేశించారు. జిల్లా వైద్యశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. తర్వాత మాట్లాడుతూ గతంలో సదరమ్ సర్టిఫికెట్లు పొందిన వారికి ప్రభుత్వం మరోసారి పరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు.

నాడు ఘనం ... నేడు దైన్యం

ఆధ్యాత్మిక సేవలు, దానధర్మాలు చేసిన జమీందారీ వంశీయులు నేడు ఆర్థికంగా చితికిపోయి, బతుకు భారంగా వైద్యానికి సైతం అవస్థలు ఎదుర్కొంటున్నారు. చిలకలూరిపేట తొలి, మలి జమీందారులుగా రాజామానూరి వంశీయులు సుమారు 138 సంవత్సరాలు వ్యవహరించారు. కాలక్రమంలో ఆ వ్యవస్థ రద్దు కావడం, ఆస్తులు హరించుకుపోవడంతో నేడు దీన స్థితిని ఆ వంశీయులు ఎదుర్కొంటున్నారు. పూర్వం రాజమందిరాన్ని తలపించేలా పెదకోటగా పిలవబడే జమీందారీ అధికారిక భవంతిలో జీవనం గడిపిన వారి వంశీయులు.. శిథిలం కాగా , మిగిలిన కొద్ది భాగంలో నేడు నివాసం ఉంటున్నారు. ఆ వంశానికి చెందిన నిరుద్యోగి అయిన రాజమానూరి వెంకట రామచంద్రరావు తన తల్లి పద్మావతి హృద్రోగంతో బాధపడుతున్నా వైద్యం చేయించలేని స్థితిలో ఉన్నారు.



శిథిలమైన పెదకోటలో మిగిలిన కొద్ది భాగం

- పూర్వీకుల జమానాలో దానధర్మాలు
- పలు దేవాలయాల నిర్మాణాలు
- మనసున్న జమీందారులుగా గుర్తింపు
- నేడు బతుకు భారంగా రాజామానూరి వంశీయులు

చిలకలూరిపేట: చిలకలూరిపేటకు తొలినాళ్లలో చిలకలూరిపాడుగా పేరుండేది. ఈ ప్రాంతానికి తొలి, మలి జమీందారులుగా వ్యవహరించిన ఘనత మానూరి వంశీయులకు దక్కుతుంది. పూర్వం పోలీస్‌స్టేషన్ సమీపంలో పెదకోట, చినకోటలు ఉండేవి. కాలక్రమంలో చినకోటను ఇతరులు కొని ఓ ఆసుపత్రి నిర్మించారు. పెదకోట శిథిలమై ప్రస్తుతం కొన్ని ఆనవాళ్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. వీరు మధ్వ బ్రాహ్మణులు. కర్ణాటకలోని ఉడిపి ప్రాంతం నుంచి వచ్చినట్లు ఈ వంశీకులు తెలుపుతారు. మానూరి వంశీయులు ఈ ప్రాంతానికి జమీందారులుగా పరిపాలన కొనసాగించటంతో మానూరికి ముందు రాజా చేరి రాజామానూరి వంశంగా గుర్తింపు పొందారు. వీరిలో మొగలాయి చక్రవర్తుల నుంచి అధికారం పొంది మూర్తీజానగర్ (ప్రస్తుతం కొండవీడు) జమీందారుగా వీరి మూల పురుషుడు రాజామానూరి కొండలరావు నియమింపబడ్డారు. ఆయన తొలిభార్యకు కుమారులు వెంకన్నారావు, నరసన్నరావు. రెండో భార్యకు అప్పాజీరావు, అక్కప్పారావులు సంతానం. కొండలరావు అనంతరం 160 గ్రామాలతో చిలకలూరిపేట జమీందారీ ఏర్పడింది. 1707లో మొగలాయిల సామంతులైన ఆసఫ్‌జాహి వంశీయులచే అధికారం పొంది చిలకలూరిపేట సర్దేశపాండ్యగా వెంకన్నారావు నియమితులయ్యారు. వెంకన్నారావుకు పిల్లలు లేనందున తమ్ముడు నరసన్నరావు కుమారుడు వెంకట్రావును దత్తత తీసుకున్నారు. అలా ఆయన జమీందారు అయ్యారు. వెంకట్రావుకు పిల్లలు లేనందున ఆయన తమ్ముడి కుమారుడైన వెంకటకృష్ణమ్మరావు కుమారుడు చిన నరసన్నరావును దత్తత చేసుకున్నారు. ఆయన తర్వాత ఇదే వంశానికి చెందిన అప్పాజీరావు కుమారుడు వెంకటేశం జమీందారుగా వ్యవహరించారు.



రాజామానూరి వంశీయులు నిర్మించిన నృసింహస్వామి గుడి



పెద్దరథం రథశాల

బ్రిటీష్ జమానాలో....

ఆంగ్లేయుల దండయాత్రలో 1788లో ఆసఫ్‌జాహి వంశీయుడైన మీర్‌అలీఖాన్ గుంటూరు జిల్లాను బ్రిటీషర్లకు ధారాదత్తం చేశాడు. 1779లో జమీను రెండు భాగాలుగా చేశారు. అప్పటి వరకూ చిలకలూరిపేటలో కలిసి ఉన్న సత్తెనపల్లి పరగణ విడిపోయింది. మానూరి మూలపురుషుడు కొండలరావు తొలిభార్య సంతతికి చెందిన నరసన్నరావుకు చిలకలూరిపేట జమీ 79 గ్రామాలతో దక్కింది. రెండో భార్య సంతతికి చెందిన వెంకటేశానికి సత్తెనపల్లి లభించాయి. 1809లో నరసన్నరావు మృతి చెందటంతో ఆయన వారసుడిగా వెంకటకృష్ణమ్మ అధికారంలోకి వచ్చారు. వెంకటకృష్ణమ్మ 1815లో మృతి చెందటంతో ఆయన కుమారుడు వెంకట నరసింహారావుకు జమీ దక్కింది. కొద్దికాలానికే నరసింహారావు తన బంట్రోతు చేతిలో హత్యకు గురి అయ్యారు. ఆయన అనంతరం తమ్ముడు వెంకన్నరావు అధికారం చేపట్టారు. ఆయన 1840లో మృతి చెందారు.



ఆర్‌ఎం పద్మావతి

జమీందారీ వ్యవస్థ రద్దుతో....

1836లో ఆంగ్లేయులు జమీందారీ వ్యవస్థ రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం 1845లో జమీన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జమీందారులకు మనోవర్తి ఏర్పాటు చేశారు. దీంతో అధికారికంగా ఆఖరి జమీందారుగా వెంకన్నరావు నిలిచారు. ఆయన అనంతరం దత్తపుత్రుడు వెంకటకృష్ణ నరసింహారావుకు రూ. 300 మనోవర్తి మాత్రమే లభించింది. ఆయన అనంతరం ఆయన దత్తపుత్రుడు వెంకటరమణయ్యారావుకు కూడా మనోవర్తి వచ్చింది. తర్వాత ఆయన సంతతికి చెందిన వారు పెదకోట, చినకోటలో నివాసాలు ఏర్పరుచుకున్నారు. పెదకోటలో రాజామానూరి హనుమంతరావు పెదరాజాగా, చినకోటలో రాజామానూరి వెంకటకృష్ణ నరసింహారావు చినరాజాగా నేటి తరానికి చెందిన వారికి సుపరిచితులు. వారి అనంతరం పెదకోటలో హనుమంతరావు కుమారుడు వెంకట పాండురంగారావు నివాసం ఉండేవారు. ఆయనకు ఇరువురు కుమారులు కాగా, రాఘవేంద్రరావు సుమారు మూడేళ్ల కిందట గుండెపోటుతో మృతి చెందారు. రెండో కుమారుడు వెంకట రామచంద్రరావు తన తల్లి పద్మావతితో కలిసి శిథిలంకాగా మిగిలిఉన్న కొద్దిపాటి భవనంలో నివాసం ఉంటున్నారు. చినరాజా వెంకటకృష్ణ నరసింహారావు సంతతి ఆయన తదనంతరం హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలివెళ్లారు.

మనసున్న జమీందారులు

రాజామానూరి వంశీయులకు మనసున్న జమీందారులుగా పేరుంది. వారి పాలనా కాలంలో శిస్తు వసూళ్లలో కఠినంగా వ్యవహరించేవారు కాదని చెప్పుకుంటారు. ఆ కాలంలో పిండారీలు అనే దోపిడీదొంగలను సమర్థంగా ఎదుర్కొన్నారు. స్వతహాగా దైవభక్తి పరాయణులైన వీరి కాలంలో 1712లో పట్టణంలో శ్రీభూనీలారాజ్యలక్ష్మి సమేత నృసింహస్వామి దేవస్థానం, పెద్దరథం, రథశాల, చంపీజ్‌ఖాన్ పేటలో వెన్నముద్ద వేణుగోపాలస్వామి ఆలయం, పుట్టకోటలోని బొల్లుమోర వెంకటేశ్వరస్వామి ఆలయం తదితర దేవాలయాలు నిర్మితమయ్యాయి. జమీందారీ వ్యవస్థ రద్దు అయింది. వారి కోటలు శిథిలమయ్యాయి. వారు చేసిన సేవలు ఇప్పటికీ ప్రజల మనసుల్లోనే నిలిచి ఉన్నాయి. అలాంటి వంశానికి చెందిన తీవ్రమైన హృద్రోగంతో బాధపడుతున్న పద్మావతికి వచ్చే సామాజిక వృద్ధాప్య పింఛన్, వారి వంశీకుల జమానాలో నిర్మితమైన ఓ ఆలయం వారు ఇచ్చే కొద్దిపాటి ఆర్థిక సాయమే దిక్కైంది. ఆమె, కుమారుడు వెంకట రామచంద్రరావు భారంగా జీవనం వెళ్లదీస్తున్నారు.

రెండు సార్లు గుండెపోటు



అమ్మ పద్మావతికి గతంలో ఒకసారి, అన్నయ్య రాఘవేంద్రరావు మృతి చెందినప్పుడు రెండో సారి గుండెపోటు వచ్చింది. మా పూర్వీకులు అంతా బాగున్న రోజుల్లో మనోవర్తి సైతం వదులుకున్నారు. మా అమ్మ, నేను ఒకరికి ఒకరం తోడుగా జీవనం కొనసాగిస్తున్నాం.


– ఆర్‌ఎంవీ రామచంద్రరావు

కక్ష సాధింపులకు పరాకాష్ట

పాత కేసుకు కొత్త సెక్షన్లు

- వినుకొండ పోలీసుల అడ్డగోలు పోకడలు
- రెండున్నరేళ్ల కిందటి కేసులో తాజాగా మార్పులు
- రషీద్ హత్యకేసులో నిందితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు
- 22 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను రిమాండ్‌కు పంపిన వైనం
- రషీద్ హత్యకు గురికాగా.. ఆయన సోదరుడిపైనా కేసు బనాయింపు

సాక్షి, నరసరావుపేట: వినుకొండ టౌన్ పోలీసులు పాత కేసుల్లో కొత్త సెక్షన్లు చేర్చి వైఎస్సార్‌సీపీ నేతలను రిమాండ్‌కు పంపారు. వినుకొండ పట్టణ పరిధిలో 2022 జులై 10వ తేదీన జరిగిన బైకు దహనం కేసులో మంగళవారం 22 మందిని పోలీసులు స్థానిక వినుకొండ జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టారు. వారికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. కేసు వివరాల్లోకి వెళితే... 2022 జులై 10వ తేదీన ఎస్‌కే షఫీ అనే వ్యక్తిపై జిలానీ అనే యువకుడు బీరు సీసాతో దాడి చేసి గొంతుకోశాడు. దీంతో షఫీ ఆత్మీయులు ఆవేశంతో తమ ఇంటిపై దాడి చేసి బైక్‌ను దహనం చేసినట్టు జిలానీ సోదరుడు జిమ్ జానీ (జానీ బాషా) వినుకొండ టౌన్ పోలీసుస్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశాడు. సరైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు.



దీంతో జిమ్ జానీ తన ఇంటి వద్ద ఉన్న బైక్‌ను తగలబెట్టారని 15 మందిపై అప్పట్లో ప్రైవేట్ కేసు వేయగా.. ఇంకా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉంది. గొంతు కోసిన ఈ జిలానీ ఎవరో కాదు.. రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను నడిరోడ్డుపై హత్య చేసిన కేసులో నిందితుడు. జిమ్ జానీ సైతం తమ బిడ్డ హత్యకేసులో భాగస్వామి అని, వెంటనే అరెస్ట్ చేయాలని రషీద్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు జానీని అరెస్ట్ చేయకపోవడం గమనార్హం.

రెండున్నరేళ్ల తరువాత ఫిర్యాదు...

రషీద్ మర్డర్ కేసు నుంచి బయటపడటంతో పాటు వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్న మైనార్టీలను భయపెట్టాలన్న ఉద్దేశంతో కూటమి నేతల అండదండలతో రషీద్ హత్య కేసు నిందితులు కొత్త ప్లాన్ అమలు చేశారు. ఇందుకు పోలీసుల సహాయం లభించడంతో అక్రమ సెక్షన్లు బనాయింపు చకచకా జరిగిపోయింది. ఇందులో భాగంగా జిమ్ జానీ వేసిన ప్రైవేట్ కేసు పెండింగ్‌లో ఉండగానే.. కొత్తగా రెండున్నరేళ్ల తరువాత మరో ఫిర్యాదు ఇచ్చారు. దీని ఆధారంగా గత నెల 29వ తేదీన వినుకొండ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో గతంలో కోర్టులో వేసిన ఫిర్యాదులో జిమ్ జానీ ఇంటి మీదకు వచ్చి బైక్ తగలబెట్టారని రాయగా, కొత్తగా ఇచ్చిన ఫిర్యాదులో ఏకంగా ఇంటినే తగలబెట్టారని మార్చి రాశారు. ఇందులో నిందితులకు బెయిల్ రాకూడదన్న కక్షతో మంగళవారం అప్పటికప్పుడు సెక్షన్లను పెంచి కోర్టులో మెమో దాఖలు చేసినట్టు తెలుస్తోంది.

రెండున్నరేళ్లలో రెట్టింపైన నిందితులు

మరోవైపు గతంలో కోర్టులో వేసిన ఫిర్యాదులో 15 మంది నిందితులు పేర్లు చేర్చగా, తాజా ఫిర్యాదులో ఏకంగా 30 మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో హత్యకు గురైన రషీద్ సోదరుడు ఖాదర్ బాషా పేరు సైతం చేర్చడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రోద్బలంతోనే దాడి జరిగిందని, పార్టీ మారనందుకే తమ ఇంటిపై దాడి చేశారంటూ కొత్త రాగం తెరపైకి తెచ్చారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చట్టానికి వ్యతిరేకంగా పోలీసులు సెక్షన్లు మార్చడం పట్ల న్యాయనిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ కేసు పెండింగ్‌లో ఉండగా రెండున్నరేళ్ల తరువాత వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా కేసు నమోదు చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. మైనార్టీలను రాజకీయంగా వైఎస్సార్‌సీపీ వైపు వెళ్లకుండా చేయడంతో పాటు ఎలాగైనా రషీద్ హత్య కేసు నుంచి బయటపడాలన్న కుట్రతోనే ఈ కొత్త కేసులు, సెక్షన్ల మార్పు చేస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ మైనార్టీ నేతలు వాపోతున్నారు.

ఎర్రమట్టితో ‘పచ్చ’ దందా!

ఎర్ర మట్టి తవ్వకాలతో దోచుకుంటున్న టీడీపీ నేతలు

- అమరావతి మండలం ఎండ్రాయిలో యథేచ్ఛగా మైనింగ్
- ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న వైనం
- రోజుకు 100 నుంచి 150 లారీలలో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి
- అక్రమార్జనతో జేబులు నింపుకొంటున్న తెలుగు తమ్ముళ్లు



ఎండ్రాయి శివారులో అక్రమంగా తవ్వకాలు

సాక్షి, నరసరావుపేట: అమరావతి మండల పరిధిలోని ఎండ్రాయి, లేమల్లె గ్రామాలకు చెందిన పేద దళితులు, మైనార్టీలకు సాగు చేసుకోవటానికి ప్రభుత్వం దశాబ్దం క్రితం డీకే పట్టాల రూపంలో భూమిని పంపిణీ చేసింది. లేమల్లె, ఎండ్రాయి గ్రామాల మధ్యలో ఉన్న ఈ పొలాలలో ఉన్న నాణ్యమైన ఎర్రమట్టిని గుర్తించిన టీడీపీ నేతలు వాటిపై కన్నేశారు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ భూములు కలిగిన ఎండ్రాయి, లేమల్లె గ్రామాలకు చెందిన పేద ఎస్సీ, మైనార్టీ రైతులకు డబ్బు ఆశ చూపించి తక్కువ ధరకే లీజుకు తీసుకున్నారు. తొలుత సుమారు 5 ఎకరాలతో మొదలైన గ్రావెల్ తవ్వకాలు క్రమంగా పెంచుకుంటూ నేడు సుమారు ఇరవై ఎకరాలకు చేర్చారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి అండదండలతో వారి అనుచరులు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రతిరోజు వేలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలు చేసి, తరలిస్తున్నారు. నిత్యం 100 నుంచి 150 లారీల ఎర్రమట్టి ఇతర ప్రాంతాలకు వెళ్తోంది.

> అధికారం చేపట్టిన రోజు నుంచి కూటమి నేతలు పంచ భూతాలను సైతం వదలకుండా దోపిడీ చేస్తున్నారు. అందరి కడుపులు నింపే పంట చేలను సైతం వదలడం లేదు. అమరావతి మండల పరిధిలోని ఎండ్రాయి, లేమల్లె గ్రామల పరిధిలో భూమి లేని నిరుపేదలకు వ్యవసాయం చేసుకొని బతకడానికి ఇచ్చిన అసైన్డ్ భూములను తక్కువ ధరకే టీడీపీ నేతలు లీజుకు తీసుకొని మట్టి తవ్వకాలు జరిపి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకపోయినా, సీనరేజ్ సుంకం చెల్లించకపోయినా మట్టి తవ్వకాలు ఆపేందుకు అధికారుల చర్యలు శూన్యం. స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులు కావటంతో మైనింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

అడ్డగోలుగా సంపాదిస్తున్న కూటమి నేతలు..

గత ప్రభుత్వ హయాంలో ఓ ప్రైవేట్ సంస్థకు మైనింగ్ వ్యవహారాల పన్ను వసూలును అప్పగించారు. ఆ సంస్థ ఎర్రమట్టికి టన్నుకు రూ.60 చొప్పున లారీకి రూ.1,500 వసూలు చేసింది. 10 చక్రాల లారీ మట్టి కావాలంటే ఆనాడు రూ.1,500 సీనరేజి చెల్లించి, రవాణా ఖర్చులు భరించాలి. కానీ నేడు 10 చక్రాల లారీ మట్టి కావాలంటే క్వారీలోనే రూ.6,000 చెల్లించాల్సి వస్తోంది. గతంలో వసూలు చేసిన రూ.1,500 ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యేది. కాని నేడు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా జమ చేయకుండా ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు చేసి కూటమి నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయానికి గండిపడుతోంది.

పొంచి ఉన్న ప్రమాదం ...

కూటమి నేతలు ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తూ సుమారు 30 – 40 అడుగుల లోతున గోతులు తవ్వుతున్నారు. దీంతో ఈ గుంటలలో నీరు ఊరటంతో ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ తిరిగే రైతులు, పిల్లలు, పశువులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రెండు గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అలాగే ప్రతి ఏడాది గుంటూరు శివారులోని గోరంట్ల వద్ద హోసన్నా మందిరం వారు లక్షలాది భక్తులతో నిర్వహించే గుడారాల పండుగ ఈ సంవత్సరం ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్న క్వారీ సమీపంలోని చర్చి వద్ద చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పండుగ ఇక్కడ నిర్వహిస్తే ఈ గుంతల నుంచి భక్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా అక్రమ మైనింగ్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వాటికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వానికి రావాల్సిన పన్నులను అక్రమార్కుల నుంచి ముక్కుపిండి వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



తవ్వకాలు జరిగిన చోట నిలిచిన నీరు

వైరల్ ఫీవర్లపై అప్రమత్తత ముఖ్యం

- దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు
- ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తేనే నివారణ సాధ్యం
- వైద్యులు, సూపర్‌వైజర్లతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి సమీక్ష

సత్తెనపల్లి: శీతాకాలంలో వైరల్ ఫీవర్లతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సత్తెనపల్లి డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చలి తీవ్రత పెరిగి అనేక వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాతావరణం చల్లగా ఉండటంతో హానికారక వైరస్ శరీరంలోకి ప్రవేశించి వ్యాధులకు కారణమవుతుందని చెప్పారు. ఈ కాలంలో సాధారణంగా జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, ఫ్లూ వంటి వ్యాధులు సంభవిస్తాయని పేర్కొన్నారు. వీటితోపాటు పలు రకాల అంటు వ్యాధులు, కంటి వ్యాధులే కాకుండా ఎలర్జీలు, ఆస్తమా, సీవోడీపీ, అలర్జిక్ బ్రాంకైటిస్, నిమోనియా వంటి శ్వాసకోశ వ్యాధుల తీవ్రత పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కనీస జాగ్రత్తలు పాటించడం ద్వారానే వీటి నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మెరుగుపడాలని ఆదేశించారు. బాధితులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కేంద్రాల వారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లా డిప్యూటీ వైద్య అధికారి డాక్టర్ పద్మావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.గీతాంజలి, నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న డాక్టర్ రవి

క్లుప్తంగా

బిక్కుబిక్కుమంటున్న కేజీబీవీ విద్యార్థినులు

ప్రాంగణం వద్ద కొండచిలువ, పాముల సంచారంతో బెంబేలు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ) చుట్టూ బయట వైపు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో కొండచిలువ, రెండు పాములు మంగళవారం సంచరించాయి. పాఠశాల ప్రహరీ సమీపంలో అవి కనిపించడంతో విద్యార్థినులు బెంబేలెత్తి బయటకు పరుగులు తీశారు. పరిసరాలు అధ్వానంగా ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా స్పందించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రహరీ నిర్మించాలని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యువతి ఆత్మహత్య

మాచర్ల: పట్టణంలోని పదో వార్డులో నివాసం ఉండే డిగ్రీ చదువుతున్న యువతి (20) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కథనం ప్రకారం... నాలుగు నెలలుగా ఆమె కడుపు నొప్పితో బాధపడుతోందని, ఆ బాధ భరించలేక మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సమాచారం అందుకున్న సీఐ ప్రభాకరరావు, ఎస్సై సంధ్యారాణిలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయింపు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లాలో 13, పల్నాడు జిల్లాలో 13 షాపుల చొప్పున 26 షాపులను కేటాయించింది. వీరికి మద్యం దుకాణాలు కేటాయింపునకు సంబంధించి ఎక్కడెక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలో పూర్తి వివరాలతో గెజిట్ త్వరలో విడుదల కానుంది. దాని ప్రకారం టెండర్లు నిర్వహించి ఎక్సైజ్ అధికారులు షాపులు కేటాయిస్తారు.

బంగారు కమ్మలు చోరీ చేసిన మహిళ

అద్దంకి రూరల్: కమ్మలు కాజేసిన మహిళను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. అద్దంకి శ్రీరామ బజారులోని హనుమాన్ జ్యూయలరీ షాపునకు ఓ మహిళ వచ్చి కమ్మల మోడల్స్ చూపించమని అడిగింది. ఈ క్రమంలో రెండు బంగారు కమ్మలను తీసుకుని వాటి స్థానంలో నకిలీవి పెట్టి వెళ్లిపోయింది. యజమాని ఆమెను వెతికిపట్టుకున్నారు. తీసుకున్న కమ్మలు ఇచ్చింది. దీంతో షాపు యజమాని ఆమెను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు.

నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలను కోల్పోవద్దు



టీషర్ట్‌లను ఆవిష్కరిస్తున్న సంజీవ్‌కుమార్ తదితరులు

నరసరావుపేట రూరల్: రహదారి భద్రతా నియమాలు పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి విలువైన ప్రాణాలను కోల్పోవద్దని జిల్లా రవాణా శాఖ అధికారి జి.సంజీవకుమార్ తెలిపారు. నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో మంగళవారం రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర, జిల్లా రవాణా శాఖ, పోలీసు ట్రాఫిక్ విభాగం, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంజీవకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. దేశవ్యాప్త మరణాలలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాల్లోనే సంభవిస్తున్నాయని గుర్తుచేశారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలను నడపరాదని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు 25 మందికి ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. వీరు వలంటీర్లుగా రహదారి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర అధికారి కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. వలంటీర్లుకు టీషర్ట్‌లు, క్యాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శివనాగేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ వేణు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కావ్య, ఎంఎల్ వంశీకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జేఎన్ సురేష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పి.లాజరు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ



గుంటూరు జెయింట్స్‌కు ట్రోఫీ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ సమీపంలోని జీఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహిస్తున్న భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ–20 క్రికెట్ టోర్నమెంట్ బీపీఎల్ 2024–25లో భాగంగా రెండో రోజైన మంగళవారం ప్రిలిమినరీ మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉదయం హైదరాబాద్ హాక్స్ జట్టు–3తో గుంటూరు జెయింట్స్–3 తలపడగా, గుంటూరు జెయింట్స్–3 జట్టు విజయం సాధించింది. అదే విధంగా మధ్యాహ్నం కృష్ణా నైట్స్, వైజాగ్ వెలాసిటీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ వెలాసిటీ జట్టు గెలుపొందింది. ఈసందర్భంగా విజేతలుగా నిలిచిన జట్లకు భాష్యం రామకృష్ణ ట్రోఫీలను బహూకరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా వాసికి జాతీయ రంగస్థల పురస్కారం



బాపట్ల: బాపట్ల జిల్లా ఆదర్శనగర్‌కు చెందిన సంగాని ఏడుకొండలుకు జాతీయ రంగస్థల పురస్కారం దక్కింది. తెలుగు సంస్కృతి–సాహిత్య సేవా ట్రస్టు, ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాతీయ స్థాయి మొదటి వార్షికోత్సవం విజయవాడలో జరిగింది. వార్షికోత్సవంలో బాలచంద్రుడు ఏకపాత్రను ప్రదర్శించిన సంగాని ఏడుకొండలుకు స్వర్ణకంకణంతోపాటు జాతీయ రంగస్థల పురస్కారం లభించింది. 36ఏళ్లుగా పౌరాణిక, నాటకం ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన సంగానికి పురస్కారం రావటంపై పలువురు అభినందనలు తెలిపారు. మరోన్నె పురస్కారాలు సొంతం చేసుకోవాలని బాపట్ల నవ్యనాటక కళాసమితి అధ్యక్షులు సోమరాజు శ్రీను కోరుకున్నారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు

లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: భూ యజమానులు రుణాలు తీసుకోకుండా ఉంటే గుర్తింపు కార్డులున్న కౌలు రైతులకు ఈ రబీలో పంట రుణాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో వ్యవసాయశాఖ, బ్యాంక్, రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ భూ యజమానులు కౌలు రైతులకు సహకారం అందిస్తే బ్యాంకు రుణాలు అధిక మొత్తంలో ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో 40,000 మంది గుర్తింపు కార్డులు పొందితే అందులో 12 వేల మంది భూ యజమానులు రుణాలు పొందకుండా ఉన్నారని చెప్పారు. ఎటువంటి ష్యూరిటీ లేకుండా భూమి లేని కౌలు రైతులకు గ్రూపుల ద్వారా రూ.రెండు లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ మాట్లాడుతూ కౌలు రైతులందరికీ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కౌలు రైతులు లీడ్ బ్యాంకు మేనేజర్‌కు తమ సమస్యలు విన్నవించారు. అనంతరం లీడ్ బ్యాంకు మేనేజర్‌ను కౌలురైతులు సన్మానించారు. కార్యక్రమంలో అజయ్, ఏడీఏ శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఇమ్మడి రామారావు, సర్పంచ్ మబ్బు శిరీష, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, కౌలు రైతులు, రైతులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు

నగరం: ఎక్సైజ్ చట్టాలను విధిగా పాటించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టాలకు అనుగుణంగా మద్యం షాపులు నడపాలన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరపాలన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ప్రజల వద్దకే మద్యం కథనంపైన ఆయన ఆరా తీశారు. సమావేశంలో సీఐ మారుతి శ్రీరామ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగ పోటీలను నిర్వహిస్తున్నట్లు జేవీవీ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్ తెలిపారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో జరిగిన కార్యక్రమంలో సైన్స్ ప్రయోగ పోటీల పోస్టర్లను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం – సుస్థిరాభివృద్ధి, మూఢ నమ్మకాలు – శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై 8,9,10 తరగతుల విద్యార్థులు ఐదు నిమిషాల నిడివి గల వీడియోను పంపాలని సూచించారు. వివరాలకు 90004 53600 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు జి.వెంకట్రావు, టీఆర్ రమేష్, డాక్టర్ ఏ. సత్యనారాయణ ప్రసాద్, ఎస్ఎం సుభానీ, యశ్వంత్, భారవి తదితరులు పాల్గొన్నారు.

వెంగళరెడ్డినగర్‌లో దేవాలయం కూల్చివేత



కూల్చివేసిన ఆలయం ముందు కాళీబాయ్



ఆలయ శిథిలాలు

- ముందుగా చెప్పలేదని నిర్వాహకురాలు ఆవేదన
- ఓ ఇంటికి విలువ పెరిగేందుకే ఇలా చేశారని ఆరోపణ
- కలెక్టర్‌కు ఫిర్యాదుతో కూల్చామని చెబుతున్న మున్సిపల్ కమిషనర్

నరసరావుపేట: పట్టణంలోని ఎనిమిదవ వార్డు వెంగళరెడ్డినగర్ కాలనీలో రమావత్ కాళీబాయ్ అనే మహిళ నిర్వహిస్తున్న త్రికోటేశ్వరస్వామి, కనకదుర్గమ్మ ఆలయాన్ని పురపాలకసంఘ అధికారులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. గత శనివారం పోలీసులతో మున్సిపల్ ప్రణాళికా అధికారి సాంబయ్య వచ్చి జేసీబీ సహాయంతో తన ఇంటి ముందు నిర్వహిస్తున్న ఆలయాన్ని కూల్చివేశారని కాళీబాయ్ మంగళవారం 'సాక్షి'కి వెల్లడించారు. తన ఇంటిపక్కనే ఉన్న జ్ఞానోజీ అనే వ్యక్తి ఇంటి విలువ పెరిగేందుకు తాను గత పదిహేనేళ్ల నుంచి నిర్వహిస్తున్న దేవాలయాన్ని కూల్చారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. తాను 2007లో ఇల్లు కొనుక్కున్నానని, అప్పటికే అందులో పుట్ట ఉందన్నారు. దాన్ని సంరక్షిస్తూ చుట్టూ గోడ నిర్మించానన్నారు. ఇంటిముందు ఉన్న చెట్టు కింద త్రికోటేశ్వ స్వామి, కనకదుర్గమ్మ ఫొటోలు పెట్టి రోజూ పూజిస్తుండగా చుట్టుపక్కల వారు ఇచ్చిన చందాలతో భక్తుల కోసం చిన్నషెడ్డు ఏర్పాటు చేశామన్నారు. కొంతమంది వ్యక్తులు ఇది జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముందుగానే తనకు చెప్పి ఉంటే రోడ్డుపైకి వచ్చిన వాటిని తొలగించేవారమని తెలిపారు. ఆ రోడ్డులో ఎన్నో ఆక్రమణలు ఉండగా.. వాటిని వదిలేశారన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును వివరణ కోరగా.. ఆ వీధిలోని వారు రోడ్డును ఆక్రమిస్తూ చేసిన దేవాలయ నిర్మాణాలు, అందులో జరుగుతున్న పూజలపై కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారని చెప్పారు. దీనిపై వచ్చిన ఆదేశాలతోనే పోలీసుల సహాయంతో అక్కడ ఉన్న ఆలయాన్ని కూల్చివేసినట్లు పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా శశికుమార్



యేలూరి శశికుమార్

నరసరావుపేట: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పిడుగురాళ్లకు చెందిన యేలూరి శశికుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం సాయంత్రం సత్తెనపల్లిరోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో జిల్లా పరిశీలకుడు జూపూడి రంగరాజు సమక్షంలో ఎన్నికల కన్వీనర్ పులి కృష్ణారెడ్డి ఈ మేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కాగా, శశికుమార్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీనియర్ నాయకుడు. రెండేళ్లుగా పల్నాడు జిల్లాకు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అధ్యక్షులుగా నియమితులైనందుకు పలువురు నాయకులు ఆయనకు అభినందలు తెలిపారు. శశికుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన అధ్యక్ష పదవికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కో రిటర్నింగ్ అధికారిగా తమ్మా వెంగళరెడ్డి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ వల్లెపు కృపారావు, జిల్లా నాయకులు బి.ఆదినారాయణ, జి.కృష్ణ మోహనశర్మ, కామినేని హనుమంతరావు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



ఉదయ్‌కిరణ్ మృతదేహం

నరసరావుపేట రూరల్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కుందుర్తి గ్రామానికి చెందిన కసుపోలు ఉదయ్‌కిరణ్ (32) రెండు సంవత్సరాలుగా పట్టణంలోని 60 అడుగుల రోడ్డు సమీపంలో నివసిస్తున్నాడు. కార్ల క్రయవిక్రయ వ్యాపారం చేస్తున్నాడు. నష్టాలు రావడంతో మార్కెట్ సెంటర్‌లో కూరగాయల వ్యాపారం ప్రారంభించాడు. అప్పులు ఇచ్చిన వారి వేధింపులు ఎక్కువ కావడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య జయలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కిశోర్ తెలిపాడు. అయితే ఉదయ్‌కిరణ్ ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల అప్పుల పాలైనట్లు ప్రచారం జరిగింది. ఇలా దాదాపు రూ.10 లక్షలు పోగొట్టుకున్నట్టు చెబుతున్నారు. కానీ ఈ ప్రచారాన్ని అతడి భార్య ఖండించారు.

ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేయాలి

ఏపీ ఎన్జీఓ మహిళా ఉద్యోగుల సమావేశం




నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: గుంటూరులోని ఏపీ ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం ఏపీ ఎన్జీవో జిల్లా మహిళా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ రాధారాణి మాట్లాడుతూ మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో మహిళా ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వాటిని జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళతామన్నారు. కన్వీనర్ లక్ష్మీరమ్య మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు కార్యాలయంలో కనీస సదుపాయాలు లేవని చెప్పారు. కొన్ని కార్యాలయాలలో నేటికీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌లు ఏర్పాటు చేయలేదని, వాటన్నిటి పరిష్కార దిశగా అడుగులు వేస్తామన్నారు. నూతన సంవత్సర ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమెన్ వింగ్ గుంటూరు జిల్లా క్యాలెండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉమెన్ వింగ్ కన్వీనర్ ఎం.రాజ్యలక్ష్మి, రాష్ట్ర ఉమెన్ వింగ్ కన్వీనర్ పి.మాధవి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, జిల్లా జాయింట్ సెక్రటరీ ఉమెన్ కె.శివ జ్యోతి, గుంటూరు సిటీ అధ్యక్షుడు సూరి, సెక్రటరీ చింతల కళ్యాణ్ కుమార్, ప్రత్తిపాడు ప్రెసిడెంట్ అనిల్, జిల్లా ఉమెన్ వింగ్ కోశాధికారి శ్రీవాణి, కో చైర్ పర్సన్ అంజలి, కో–కన్వీనర్ శైలజ, సిటి ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ లక్ష్మీ ప్రసన్న, కన్వీనర్ విజయలక్ష్మి, జిల్లా, సిటి ఉమెన్ వింగ్ కార్యవర్గ సభ్యులు, తాలూకా ఉమెన్ వింగ్ చైర్ పర్సన్, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిపై కత్తితో దాడి చేసిన అన్న అరెస్ట్

సాక్షి వార్తా కథనంతో స్పందించిన పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు

తాడేపల్లిరూరల్: ప్రకాష్‌నగర్‌లో తమ్ముడిపై కత్తితో అన్న దాడిచేసినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ సాక్షిలో వచ్చిన వార్తా కథనానికి తాడేపల్లి పోలీసులు స్పందించి నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు మాట్లాడుతూ ప్రకాష్‌నగర్‌కు చెందిన ఆరిఫ్‌ను అతని అన్నయ్య అయిన షేక్ మీరా అలియాస్ ఆసిఫ్ పాత గొడవల నేపథ్యంలో డిసెంబర్ 12న కూరగాయలు కోసే కత్తితో పొడిచాడని వివరించారు. ఆరిఫ్‌ను బంధువులు 108 వాహనం ద్వారా విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారని, జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు వివరించారు.

కుప్పకూలిన లిఫ్ట్

ఐదుగురికి తీవ్రగాయాలు

తెనాలి: సామర్థ్యానికి మించి జనం ఎక్కడంతో అపార్టుమెంటు లిఫ్ట్ కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం వెనుకవైపు వీధిలో అయ్యప్పస్వామి గుడి వద్ద గ్రీన్‌లీఫ్ మినర్వా అపార్టుమెంటులో 32 వరకు ఫ్లాట్లు ఉన్నాయి. సమీపంలోని కఠెవరం గ్రామపంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఐదో ఫ్లోరులోని ఒక ఫ్లాటులో నివసిస్తున్న కుటుంబం సోమవారం రాత్రి పురోహితులను పిలిపించి, తమ ఇంట్లో రుద్రపారాయణం చేయించారు. పూజా కార్యక్రమాలన్నీ పూర్తయి, రాత్రి 10 గంటల ప్రాంతంలో పురోహితులు, వారి సహచరులు అంతా కలిసి కిందకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. మొత్తం 11 మంది లిఫ్ట్‌లో ఎక్కారు. ఐదు నుంచి నాలుగు, మూడో ఫ్లోరు వరకు బాగానే వచ్చిన లిఫ్ట్, అక్కణ్నుంచి ఒక్కసారిగా కుప్పకూలింది. కింద ఉండే స్ప్రింగులపై పడి పైకిలేచి మళ్లీ పడిపోయిందని అక్కడ నివసిస్తున్నవారు తెలిపారు.

దీంతో లిఫ్టులోని వారంతా ఒకరిపై ఒకరు పడిపోయారు. అందులో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్ వాహనంలో వీరిని స్థానికంగా గల ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. వాస్తవానికి లిఫ్ట్ సామర్థ్యం ఆరుగురేనని చెబుతున్నారు. దాదాపు రెట్టింపు జనాభా ఎక్కడంతో లిఫ్టుకుండే వైరు తెగి ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. దీనిపై బాధితులను వివరాల కోసం సంప్రదించగా, పత్రికలో రాయొద్దని కోరారు.

అక్రమ నిర్మాణంపై దేవదాయ అధికారుల తనిఖీ



భవనాన్ని పరిశీలిస్తున్న సహాయ కమిషనరు జి.మాధవి, తెనాలి ఇన్‌స్పెక్టర్ ఎస్.శారదదేవి

కొల్లిపర: కొల్లిపరలో అనుమతుల్లేకుండా జరుగుతున్న భవన నిర్మాణాన్ని దేవదాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన బొంతు జగదీశ్వరరెడ్డి నిర్మిస్తున్న మూడంతస్తుల భవనం స్థలం శ్రీపోతురాజుస్వామి దేవాలయానికి చెందిందని, అక్కడ భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవంటూ కుంచెల వెంకటరామిరెడ్డి ఏపీసీఆర్‌డీఏ, తెనాలి జోనల్ కార్యాలయానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులందాయి. దీనిపై విచారణకు దేవదాయశాఖ సహాయ కమిషనరు జి.మాధవి, తెనాలి దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.శారదదేవి, ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి గ్రామానికి వచ్చారు. పంచాయతీ కార్యదర్శి అలకనంద, వీఆర్‌వో భాస్కర్‌తో కలిసి సంబంధిత ప్రదేశాన్ని, నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఇప్పటికే గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులు బొంతు జగదీశ్వరరెడ్డికి నోటీసులు ఇచ్చి భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయించినట్టు తెలుసుకున్నారు అనంతరం ఆలయ కమిటీ పెద్దలు, స్థానిక నివేశనదారులతో మాట్లాడారు. దేవాలయ రికార్డులను పరిశీలించారు. సంబంధిత భూమి అంతా గ్రామకంఠంలో ఉందని నిర్ధారించుకున్నారు. అనంతరం దేవాదాయశాఖ సహాయ కమిషనరు జి.మాధవి మాట్లాడుతూ కొల్లిపరలోని శ్రీపోతురాజు స్వామి గుడి దేవదాయశాఖ పరిధిలో లేదన్నారు. ఆలయానికి చెందిన స్థలంగా పేర్కొంటున్న గ్రామకంఠంలో దాదాపు 50 మంది గ్రామస్తులు నివాసగృహాలను నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్నారని వివరించారు. వీటికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. ఆలయ కమిటీ పెద్దలు, అక్కడ నివసిస్తున్న గ్రామస్తులు కలసి మాట్లాడుకుని పదిరోజుల్లో తగిన నిర్ణయం తీసుకుని నివేదించాలని సూచించారు. లేకుంటే నివాసాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల వెంట తూములూరు దేవాదాయశాఖ ఈవో ప్రసాద్, దేవాలయం కమిటీ సభ్యులు ఉన్నారు.

అక్రమంగా సాగు చేస్తున్న పంటలు ధ్వంసం

40 ఎకరాలను జేసీబీల సాయంతో దున్నేయించిన అధికారులు



శాఖమూరులో సాగులో ఉన్న భూములను జేసీబీల సాయంతో దున్నుతున్న సిబ్బంది

శాఖమూరు(తాడికొండ): సీఆర్డీఏ పరిధిలోని శాఖమూరు గ్రామంలో పూలింగ్‌కు ఇచ్చిన భూముల్లో అక్రమంగా రైతులు సాగు చేస్తున్న పంటలను అధికారులు ఎట్టకేలకు ధ్వంసం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి పత్రికల్లో కథనాలు రాయించి టీడీపీ నాయకులు కక్షతో పంటలను ధ్వంసం చేయించారు. ఈ ప్రాంతంలో పసుల్లేక పశువులను మేపుకుంటూ పశువుల మేతకోసం జొన్నసాగు చేసుకుంటున్న తమను ఇబ్బందులకు గురిచేయడంపై గ్రామస్తులు మూకుమ్మడిగా అధికారులను ప్రశ్నించారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు అక్రమంగా సాగుచేస్తున్న 40 ఎకరాల్లోని పంటలను మంగళవారం దున్నివేయించారు. మిగిలిన గ్రామాల్లో కూడా రైతులు పశుగ్రాసం కోసం పంటలు సాగు చేసుకుంటుండగా రాజధాని అభివృద్ధి పనులు పేరుతో అధికారులు వాటిని తీసేయాలని హుకుం జారీ చేస్తుండటంపై పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల విషయంలో ఒకే న్యాయం జరిగేలా అధికారులు వ్యవహరించాలని కోరుతున్నారు.

ఐదుగురు మహిళలకు సత్కారాలు

నగరంపాలెం(గుంటూరు ఈస్ట్): స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై పలు రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విశిష్ట మహిళా మూర్తులకు మంగళవారం సత్కారం జరిగింది. గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో పెద్ద సాంబశివరావు సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. 70 వసంతాల వయస్సుపైబడి పలు రంగాల్లో నిష్ణాతులైన దేవాలయ పాలక మండలి గౌరవాధ్యక్షురాలు ఆధ్యాత్మిక సేవా శిరోమణి గద్దె రామతులశమ్మ (ఆధ్యాత్మిక), వేమూరి రామలక్ష్మి (సంగీతం), డాక్టర్ సి.హెచ్. సుశీలమ్మ (సాహిత్యం), వి.ఎస్. డి.శ్యామసుందరీ దేవి (విద్యా), మాధవపెద్ది మీనాక్షి (సంగీతం)లను సత్కరించారు.